బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

సుస్థిర పాలనలోనే సురక్షిత రాష్ట్రం

దశాబ్దాల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అసమానతలు, దోపిడీల నుంచి బయటపడిన తెలంగాణ, కేసీఆర్ సారథ్యంలోని, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గత పదేండ్లలో సాధించిన అభివృద్ధి అనూహ్యం, అసమానం, అభినందనీయం! దేశంలో ఏ రాష్ట్రంలో కనబడని, చూడని, వినూత్నమైన 'రాజకీయ ఇచ్ఛ'ను (పొలిటికల్ విల్) కేసీఆర్ ప్రభుత్వం ఆవిష్కరించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకోవడమే ఇందుకు నిదర్శనం. ఆరు దశాబ్దాలలో కానరాని అభివృద్ధి కేవలం తొమ్మిదేండ్లలోనే చూడటం కేసీఆర్ ఘనతగా చెప్పక తప్పదు. వ్యవసాయ, పారిశ్రామిక, సంక్షేమ, సాంకేతిక, సాంస్కృతిక, గ్రామ, నగర, పట్టణ పురోభివృద్ధి కేసీఆర్ రాజకీయ ఇచ్ఛ ద్వారానే సాధ్యమైంది.

దేశ ఆర్థిక వ్యవస్థకు 'రైతే రాజు' అన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా రైతు, వ్యవసాయాభివృద్ధిపై దృష్టిసారించింది. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు, కుంటల పునరుద్ధరణ, మరమ్మతులు చేపట్టి అటు వ్యవసాయాన్ని ఇటు మత్స్య సంపద, జలసంపద సృష్టికి మార్గం సుగమం చేసింది. అందులో భాగంగానే దేశంలో ఎక్కడా లేని రైతుబంధు, రైతుబీమా, పంటల రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు జరిపి రైతులు బలపడి ఎదగడానికి ఇతోధికంగా తోడ్పాటు నందించి, బాధ్యతాయుత ప్రభుత్వంగా గుర్తింపు పొందింది. దశాబ్దాల నీటి దోపిడికి గురైన తెలంగాణ ప్రజలను వ్యవసాయపరంగా అభివృద్ధి పరచడానికి, పాలమూరు, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను, కాలువలను ప్రతిష్టాత్మకంగా చేపట్టి, భారీ, మధ్య చిన్నతరహా ప్రాజెక్టులను నిర్మించి, లక్షలాది ఎకరాల భూమిని సాగులోనికి తీసుకువచ్చి భారతదేశ ధాన్యాగారంగా తీర్చిదిద్దింది. ధరణి పోర్టల్ ద్వారా రైతులకు శాశ్వత భూహక్కు కల్పించడం ముదావహం. హరిత హార పథకంతో యావత్తు తెలంగాణ నేడు పచ్చదనంతో కళకళలాడుతున్నది. తెలంగాణ ప్రజల దాహార్తిని తీర్చడానికి మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నీరు వచ్చే విధానాన్ని చేపట్టి ప్రజల మన్ననలను అందుకున్నది కేసీఆర్ ప్రభుత్వం.

సమాజం అంటేనే వివిధ కులాల, వర్గాల సమాహారం. అనేక సామాజిక రుగ్మతలకు అసమానతలకు నెలవు. పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వావలంబన ఇత్యాది విషయాలు సామాన్యమైనవికావు. అభివృద్ధి ఒక్కరోజులో సాధించే విషయమూ కాదు. ఈ విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన కేసీఆర్ ప్రభుత్వం ప్రజలు సామాజిక, ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేసింది.

వయోవృద్ధులకు ఆసరా పింఛన్లు , ఎస్సీలకు దళితబంధు, గొల్ల, కురుమ యాదవ కులాలకు గొర్రెల పంపిణీ, మత్స్యకార కులాలైన బెస్త, ముదిరాజ్‌లకు చెరువులపై ఆధిపత్యాన్ని కల్పించడం, చేపపిల్లల పంపిణీ, సొసైటీల ఏర్పాటు ద్వారా ఈ కులాలన్నింటినీ అభివృద్ధిలోకి తీసుకురావడమే కాకుండా వారి స్వావలంబనను ప్రోత్సహించింది. పద్మశాలి కులస్తులకు నేతన్న బీమా, చేనేత మిత్ర, టెక్స్‌టైల్ పార్కులు, అపెరల్ పార్కులు ఏర్పాటు చేయడం తద్వారా ఉపాధికల్పన, సమాజాభివృద్ధికి కృషిచేసింది. మహిళా సమాజానికి కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టడం, అదేవిధంగా బడుగు, బలహీన మైనారిటీ వర్గాల పేద అమ్మాయిల పెండ్లిళ్లకు చేపట్టిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు అద్వితీయం. అన్ని కులాల ఆత్మ గౌరవ భవనాల నిర్మాణానికి భూములు కేటాయించడం, నిధులు సమకూర్చడం, కేసీఆర్‌లోని 'రాజకీయ ఇచ్ఛ'కు తార్కాణంగా నిలిచాయి. ఆరోగ్య తెలంగాణ దిశగా చేపట్టిన తెలంగాణ బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, కంటివెలుగు, సూపర్ స్పెషాలిటీ దవాఖానాల నిర్మాణం, జిల్లాకొక మెడికల్ కాలేజీ ఏర్పాటు వంటివి అమోఘం. విద్యాభివృద్ధికి మన ఊరు, మన బడి, విదేశీ ఉన్నత విద్యకోసం స్కాలర్‌షిప్‌లు తెలంగాణ విద్యార్థులు విద్యారంగంలో రాణించడానికి దోహదపడ్డాయి. హైదరాబాద్ ఫార్మాసిటీ, ఏరో స్పేస్ పార్క్, ఎస్ఆర్‌డీపీ రోడ్లు, ఫ్లై ఓవర్లు హైదరాబాద్‌ను 'కేసీఆర్ పాలన'కు తలమానికంగా నిలిపింది. ఇకపోతే 24 గంటల ఉచిత వ్యవసాయ విద్యుత్తు రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడింది. భారతదేశంలో ఉన్న 29 రాష్ట్రాల్లో ఏ రాష్ట్రం సాధించని ప్రగతిని, అభివృద్ధిని, కేసీఆర్ ప్రభుత్వం గత పదేండ్లలో సాధించింది. పారిశ్రామికరంగం, 24 గంటల విద్యుత్తు ద్వారా గణనీయమైన పురోభివృద్ధిని సాధించింది.

తెలంగాణ అంటే ఒక నమ్మకమైన, సుస్థిరమైన శాంతిభద్రతలు నెలకొన్న రాష్ట్రంగా పేరు తెచ్చుకొని పెట్టుబడులను అత్యధికంగా ఆకర్షించగలిగింది. తద్వారా ఉపాధికల్పన, పారిశ్రామికీకరణ వేగవంతం చేసింది. అత్యధిక తలసరి ఆదాయం, అత్యధిక తలసరి విద్యుత్తు వినియోగం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. టీఎస్ ఐపాస్, టీఎస్ బీపాస్, పారిశ్రామిక సరళీకృత విధానాలతో తెలంగాణ కొత్త పుంతలు తొక్కింది. మెడికల్ డివైజెస్ పార్కులు, సీడ్ పార్కులు, ఇమేజ్ టవర్స్ 33 జిల్లాలలో జిల్లా కార్యాలయాల నిర్మాణాలతో పాటు మౌలిక సదుపాయాల రూపకల్పనలో ముందడుగు వేసింది.

మన తెలంగాణలో జరుగబోతున్న అసెంబ్లీ ఎన్నికలు ఓటర్ల విజ్ఞతకు నిదర్శనంగా నిలువబోతున్నాయి. కేసీఆర్ దార్శనికత, రాజకీయ ఇచ్ఛ, సంకల్పం ద్వారా అభివృద్ధి జరిగిందన్న విషయాన్ని తెలంగాణ ప్రజలు గుర్తించారు. కేసీఆర్ సంకల్పం, ఆలోచనా విధానాన్ని, అభివృద్ధి పంథాను ప్రజలు గమనిస్తున్నారన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. నమ్మకానికి, రాజకీయ ఇచ్ఛకు, కమిట్‌మెంట్‌కు మారుపేరైన కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు, ప్రత్యామ్నాయమైన నేత, పార్టీ లేదన్న విషయం స్పష్టంగా కనబడుతుంది. అధికార దాహమే తప్ప తాడూ బొంగరం లేని, కీమలాటలు, కుమ్ములాటల నాయకత్వ పద్ధతి, విధానాల లేమితో, ఊహాజనిత ప్రభుత్వ వ్యతిరేక ఓటు పవనాల మీద ఆధారపడుతున్న కాంగ్రెస్ పార్టీ కేసీఆర్‌కు ఎటువంటి ప్రత్యామ్నాయం కాజాలదు.

ఇకపోతే హిందూ మతాన్ని, ద్వేషాన్ని, విద్వేషాన్ని, నమ్ముకుని, ప్రజల మధ్య, మతాల మధ్య, కులాల మధ్య, చిచ్చు పెడుతూ పూటకో మాట మాట్లాడుతున్న బీజేపీ అవలంబించే విధానాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. మూడు దశాబ్దాలుగా కనబడని మాదిగల వర్గీకరణ సమస్య ప్రధాని నరేంద్రమోదీకి కేవలం ఎన్నికలకు మూడువారాల ముందే గుర్తుకు రావడం ఇందుకు తాజా ఉదాహరణ.

కేసీఆర్ పరిపాలన లేని తెలంగాణ రాష్ట్రాన్ని ఊహించడం కష్టం. ఏదైనా పొరపాటు జరిగితే రాష్ట్రం అంధకారంలోకి, తిరోగమనానికి లోనుకావడం తథ్యం. దీనికి ప్రజలు అడ్డుకట్ట వేస్తారని, బాధ్యతాయుతంగా వ్యవహరించి, రాజకీయ ఇచ్ఛతో, కేసీఆర్ సంకల్ప ప్రభుత్వానికే మరల పెద్దపీట వేసి, విజ్ఞతతో వ్యవహరించి గెలిపిస్తారని తెలంగాణ అభివృద్ధికి మరింత దోహదపడుతారని ఆశిద్దాం.

లాల రాము ముదిరాజ్
93461 38138

అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదంటారు పెద్దలు. మరి ఎవరూ అడగకుండానే తెలంగాణ వచ్చిందా? సమైక్య పాలకుల కబంధ హస్తాలలో బందీగా మారిన తెలంగాణ తల్లిని విడిపించేందుకు అలుపెరుగని పోరాటం చేసిందెవరో అందరికీ తెలుసు. ఎవరి పోరాట ఫలితంగా ఈరోజు తెలంగాణ ఫలాలను అనుభవిస్తున్నామో..తెలంగాణ గడ్డ మీద పుట్టిన ప్రతి బిడ్డకు తెలుసు. ఇంకా చెప్పుకోవాలంటే ఈ దేశంతో పాటు ప్రపంచమంతా మాసింది. తెలంగాణను విముక్తం చేసేందుకు పదిహేనేండ్ల పాటు మన ఉద్యమ వీరుడు, తెలంగాణ ముద్దుబిడ్డ కేసీఆర్ చేసిన పోరాటం అనన్య సామాన్యం.

కొట్లాడి తెలంగాణ సాధించినం

ఈ మధ్య తెలంగాణ కాంగ్రెస్ నేతలు అసంబద్ధమైన కొత్త వాదనను తెరపైకి తీసుకొస్తున్నారు. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ, సోనియాగాంధీని చూసి ఓటు వేయాలి అంటూ కల్లబొల్లి కబుర్లు చెప్తున్న రేవంత్‌రెడ్డికి నాటి బలి దేవత సోనియాగాంధీ.. నేడు తెలంగాణ తల్లి ఎలా అయ్యిందో సమాధానం చెప్పాలి. తెలంగాణ పోరాటంలో వందల మంది యువకులు ఆత్మ బలిదానం చేసుకున్నది కాంగ్రెస్ వల్ల కాదా? తెలంగాణ ఇస్తనని చెప్పి పదేపదే మాట తప్పడం వల్లనే ఆత్మ బలిదానాలు జరిగాయన్న సత్యాన్ని రేవంత్‌రెడ్డి కాదనగలరా? అసలు ఎవరూ అడగకుండానే తెలంగాణ వచ్చిందా? ఎవరూ పోరాడకుండానే తెలంగాణ సిద్ధించిందా? కేసీఆర్ సహా తెలంగాణ కోసం వేల మంది చేసిన పోరాటాన్ని కాంగ్రెస్ నేతలు చూడలేదా? ఆనాడు తెలంగాణను కాంక్షిస్తూ అసువులు బాసిన వందల మంది అమర వీరుల మృత్యు ఘోషను కాంగ్రెస్ నేతలు వినలేదా? నాడు తెలంగాణ కోసం జరిగిన పోరాటాన్ని ఎప్పటికప్పుడు అణగదొక్కిన కాంగ్రెస్.. వందల మంది అమరుల త్యాగాలను నేడు విస్మరిస్తున్నది. కేసీఆర్ నాయకత్వంలో యావత్తు తెలంగాణ చేసిన పోరాటాన్ని కనుమరుగు చేయాలని కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నది. అందులో భాగంగానే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలంగాణపై మరోసారి విషం కక్కారు. సాంకేతికంగా తెలంగాణ ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్తూ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించి ఆయన తన వక్రబుద్ధిని బయటపెట్టారు. తద్వారా తాను సమైక్యవాది చంద్రబాబు శిష్యుడినేనని మరోసారి నిరూపించుకున్నారు. తాము అధికారంలోకి వస్తే పోరాడి సాధించుకున్న తెలంగాణపై ఆంధ్ర పెత్తనం తప్పదని చెప్పకనే చెప్పారు. ఆంధ్ర ప్రాంతానికే ఎక్కువ ప్రాతినిధ్యం ఉందని పేర్కొనడం వెనుక కూడా కుట్ర దాగి ఉన్నది. కాంగ్రెస్‌ను నమ్మడమంటే.. కసాయివాడిని గొర్రె నమ్మినట్టే. కాంగ్రెస్‌ను నమ్మితే తెలంగాణ ఆగమైనట్టే. మరోసారి తెలంగాణ పరులపాలైనట్టే.

అసలు తెలంగాణ అంటేనే కాంగ్రెస్‌కు మొదటి నుంచి అసూయ. తెలంగాణ సంపదను కొల్లగొట్టేందుకే ఆనాటి కాంగ్రెస్ పాలకులు భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరిట కుట్రలకు తెరలేపారు. హైదరాబాద్ స్టేట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ సంపదను తరలించిన కాంగ్రెస్ 1969 నాటి తొలి దశ ఉద్యమాన్ని కూడా అణచివేసింది.

తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక టీఆర్ఎస్ రూపంలో కేసీఆర్ 2001లో మరోసారి తెలంగాణ వాదాన్ని తెరపైకి తీసుకువచ్చారు. తెలంగాణ ప్రాంతంలో కేసీఆర్ ప్రభంజనం సృష్టించారు. ఎన్నిక ఏదైనా ఆయన గెలిచారు.. తెలంగాణ వాదాన్ని గెలిపించారు. క్రమంగా తెలంగాణ అంతటా ఉద్యమాన్ని తీసుకొచ్చారు. టీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి కన్ను కుట్టిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తమని నమ్మబలికి మరోసారి తన బుద్ధిని చూపించింది. 2004లో తమకు మద్దతు పలికితే తెలంగాణ రాష్ట్రకలను సాకారం చేస్తమని చెప్పి మోసం చేసింది. మ్యానిఫెస్టోలో పెట్టి మరీ హ్యాండిచ్చింది.

అయినప్పటికీ ప్రజా క్షేత్రంలో పోరాడుతూనే ఉన్న కేసీఆర్.. ఆమరణ నిరాహార దీక్షతో మరోసారి తెలంగాణ ఉద్యమాన్ని లేవనెత్తారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అని సిద్దిపేటలో దీక్షకు పూనుకున్నారు. కేసీఆర్ దీక్షకు భయపడిన నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం దీక్షాస్థలికి వెళ్తున్న ఆయనను, మార్గమధ్యంలోనే అరెస్టు చేసింది. అయినప్పటికీ వెనక్కి తగ్గని కేసీఆర్ ఖమ్మం జైలులోనే 2009 నవంబర్ 29న దీక్షకు దిగారు. పచ్చి మంచినీళ్లు కూడా ముట్టకుండా 'చావనైనా చస్తా.. కానీ తెలంగాణ సాధించి తీరుతా'నని శపథం చేశారు.

కేసీఆర్ దీక్షకు సంఘీభావంగా తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడికక్కడ విద్యార్థి, ప్రజాసంఘాలు ఆందోళనకు దిగాయి. శ్రీకాంతాచారి ఆత్మ బలిదానం చేసుకున్నారు. కేసీఆర్ దీక్షకు తలొగ్గిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 9న తెలంగాణ ఇస్తున్నట్టు ప్రకటించింది. ఆ వెంటనే ఏపీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి మరోసారి మోసం చేసింది. కానీ ఉద్యమ శిఖరం కేసీఆర్ ఈసారి పట్టు విడువలేదు. తెలంగాణ సాధనే లక్ష్యంగా ఢిల్లీ గడ్డపై ఆయన అడుగుపెట్టారు. అనేక పార్టీలను కలిశారు. వందల మంది నేతలతో చర్చించారు. వారిని ఒప్పించారు. తెలంగాణ సాధించారు. ఇదంతా ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చిందంటే.. 'తెలంగాణ మేమే ఇచ్చాం.. మేమే ఇచ్చాం.' అని చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ నేతలకు కనువిప్పు కలగాలని. తెలంగాణ ఎవరో పెట్టిన భిక్ష కాదు.. కొట్లాడి సాధించినం. ఇంకా చెప్పాలంటే.. వందల మంది అమరుల త్యాగాలు ఎందుకు కాంగ్రెస్సే ప్రత్యక్షంగా.. పరోక్షంగా అసలు కారణం.

మాలోతు సురేష్
98856 79876

జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లోనూ వాటా న్యాయంగా దక్కాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తుకున్నా స్పందించని కాంగ్రెస్, బీజేపీలు త్వరలో జరుగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోటాపోటీగా ప్రకటనలు గుప్పిస్తున్నాయి. ఈ ఎన్నికలు రెండు పార్టీలకు ఒక రకంగా జీవన్మరణ పోరాటం అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 54 శాతం పైగా ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో కనీస వాటా కూడా దక్కలేదు. స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు దాటినా పట్టించుకునే ప్రభుత్వాలు కరువై బీసీలు అభివృద్ధికి నోచుకోలేదు.

నయవంచకుల నయా తంత్రం!

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కొత్త చరిత్రను బహుజనాక్షరాలతో లిఖించుకునే ప్రయత్నం కొనసాగింది. ఓబీసీలంటే దేశ సంపద, పునాదిరాళ్లు అనే భావనతో హరిత, పింక్, శ్వేత, నీలి, క్షీర విప్లవాలకు నాంది పలికి, తెలంగాణ ప్రభుత్వం బీసీలను గొప్ప ఉత్పత్తి శక్తులుగా మార్చేందుకు చేసిన ప్రయత్నం సఫలీకృతమైంది. దేశంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో 69 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన రాష్ట్రంగా తమిళనాడు అగ్రభాగాన నిలిచింది. తమిళనాడు తరహాలోనే రాష్ట్రంలో రిజర్వేషన్లు సాధించుకునేందుకు సీఎం కేసీఆర్ అణగారిన వర్గాలకు అండగా నిలిచారు. రాష్ట్రంలో ఉన్న కులాల దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ రంగాల్లో వారి ఆర్థిక స్థితిగతులను బట్టి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమ పరిధిలో రిజర్వేషన్లు ఇచ్చుకునే అధికారం ఇవ్వాలని కేంద్రం మీద ఒత్తిడి తెస్తున్నారు. ఇందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలను ఏకం చేసే ప్రయత్నం కేసీఆర్ చేస్తున్నారు. ఒక ఓబీసీ నాయకుడు భారతదేశానికి ప్రధానిగా ఉండి ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయకుండా తీరని అన్యాయం చేశారనే విమర్శ లేకపోలేదు.

దక్షిణాదిన పాగా వేయాలనే ఆలోచనతో ఉత్తరప్రదేశ్‌లో అనుసరించిన బీసీ ఫార్ములానే తెలంగాణలోనూ అమలుచేయటం ద్వారా ప్రయోజనం ఉంటుందనేది బీజేపీ నేతల అంచనా. ఎక్కువమంది బీసీ నేతలకు, మహిళలకు టిక్కెట్లు ఇవ్వడంతో పాటు, మ్యానిఫెస్టోలో కూడా బీసీ డిక్లరేషన్ హామీలతో పాటు, ఇప్పటివరకు డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదం వినిపించిన బీజేపీ నేతలు బీసీ కార్డు పేరుతో మరోమారు దగా చేసేందుకు తెలంగాణలో బీసీ ఓట్లను దండుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

సంస్థాగతంగా బీజేపీ బలంగా లేకపోవడం వల్లనే బీసీ ఓటర్లకు దగ్గరయ్యేందుకు బీసీ సీఎం నినాదం ఎత్తుకున్నదనే విమర్శ ఉన్నది. బీజేపీ బీసీ నేతల్లో ఎవరు సీఎం అభ్యర్థి అనేది మాత్రం తేల్చలేదు. ఒకానొక సమయంలో బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉన్నప్పుడు బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అనిపించడానికి కారకుడైన బీసీ బిడ్డను స్థానభ్రంశం చేసింది బీజేపీ నాయకత్వమే కదా? ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టుగా పరిస్థితుల్లో మార్పు వచ్చింది. తెలంగాణలో బీజేపీ చతికిలపడే సరికి ఆ లోటును అధిగమించడానికి మళ్లీ బీసీ ముఖ్యమంత్రి ప్రస్తావన తెచ్చారనేది అందరిలో కనిపిస్తున్నది. అయితే, ఈ ప్రకటన బీజేపీకి ఓట్లను తెచ్చి పెడుతుందా? తెలంగాణ ప్రజలు నమ్ముతారా? దింపుడుకల్లం ఆశ అంతా తెలంగాణలో హంగ్ వస్తుందని, తమదే కింగ్ మేకర్ పాత్ర అని బీజేపీ కలలు కంటున్నది. అందుకే బీసీ కార్డు ప్రయోగించింది. దశాబ్దకాలంగా ఓబీసీ జనగణన చేయకుండా ఎలక్షన్లలో లబ్ధికోసమే ఎత్తుగడ పన్నారనే వాస్తవం అందరికీ తెలిసిందే.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి తాడో-పేడో తేల్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికో మ్యానిఫెస్టోతో మాయ చేస్తున్నది. కర్ణాటక ఎన్నికల్లో ఉపయోగించిన స్టాటజీనే తెలంగాణలో అమలు చేస్తున్నది. ఇందులో భాగంగానే కామారెడ్డిలో నిర్వహించిన ప్రచారసభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్‌ను పెంచుతామని ప్రకటించింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్, బీసీ సబ్‌ప్లాన్, బీసీల అభివృద్ధికి ఏటా 20 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో లక్ష కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించారు. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను కాపీ కొట్టి ఆరు గ్యారెంటీలతో ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేసింది. అయినా ఆదరణకు నోచుకోక కాంగ్రెస్ ఇప్పుడు బీసీ డిక్లరేషన్ ప్రకటించి మైలేజ్ పొందాలని నయా స్టాటజీని ప్రయోగించింది. 2014 ఎన్నికల్లో చంద్రబాబు కూడా తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీ నేత ఆర్.కృష్ణయ్య సీఎం అవుతారని ప్రకటించారు. కానీ తెలంగాణ ప్రజలు ఆదరించలేదు. అయితే తెలంగాణలో పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసేది బలహీనవర్గాలేనని సర్వేలు చెప్తున్నాయి. ఎవరు ఔనన్నా, కాదన్నా ఈసారి బీసీలు ప్రధానపాత్ర పోషించనున్నారనేది వాస్తవం.

డాక్టర్ సంగని మల్లేశ్వర్
98662 55355

నిరుద్యోగులతో ఆటలా?

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ జైత్రయాత్రకు అడ్డుకట్ట వేసి అధికారం చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్, బీజేపీలు సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగిస్తున్నాయి. అదేవిధంగా అధికార సాధనే ధ్యేయంగా ఆ పార్టీలు ప్రజలను కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజించి హామీలు గుప్పిస్తున్నాయి. అయినా ఆశించినంత సానుకూలత ప్రజల నుంచి రావటం లేదు. దీంతో రాష్ట్రంలోని నిరుద్యోగుల ద్వారా ఈ ఎన్నికల్లో లబ్ధి పొంది అధికారంలోకి రావాలని కాంగ్రెస్, బీజేపీలు కొత్తరకం రాజకీయాలకు తెరతీశాయి.

తెలంగాణలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నట్టు కాంగ్రెస్, బీజేపీలు చెప్తున్నాయి. వారిని రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని ఆ పార్టీలు భావిస్తున్నాయి. పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు సందర్భాల్లో బహిరంగంగా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మళ్లీ గెలిస్తే నిరుద్యోగులంతా అన్నల్లో కలసిపోతారని, తద్వారా రాష్ట్రంలో మళ్లీ నక్సలిజం పెరిగిపోతుందని రేవంత్‌రెడ్డి విమర్శిస్తున్నారు. నిర్దిష్టమైన ప్రణాళిక, స్పష్టమైన హామీలతో రాజకీయ పార్టీలు నిరుద్యోగుల ఓట్ల కోసం ప్రయత్నించాలి. కానీ దానికి పూర్తి భిన్నంగా సత్య దూరమైన సమాచారంతో, అస్పష్టమైన హామీలతో, రెచ్చగొట్టే వ్యాఖ్యలతో నిరుద్యోగుల ఓట్ల కోసం ప్రయత్నిస్తుండటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. దీని వల్ల నిరుద్యోగులు మరింత ఆందోళనకు గురై తద్వారా నిరాశ, నిస్పృహలకు లోనయ్యే ప్రమాదం ఉన్నది. నిరుద్యోగం అత్యంత సున్నితమైన అంశం. స్వతంత్ర భారతావని ఆవిర్భావం నుంచి నేటి వరకు దేశం ఎదుర్కొంటున్న సమస్యలలో అత్యంత ప్రధానమైనది నిరుద్యోగం. దేశ జనాభాలో యువత అత్యధిక శాతం ఉన్నారు. దేశాభివృద్ధిలో ఈ యువతదే ప్రధాన పాత్ర అనడంలో ఎటువంటి సందేహం లేదు. విద్యాభ్యాసం పూర్తయిన వెంటనే అర్హతకు తగిన ఉద్యోగం పొంది జీవితంలో స్థిరపడాలని యువత, అష్టకష్టాలు పడి వారిని చదివించిన తల్లిదండ్రులు కోరుకుంటారు. ఉద్యోగాల విషయంలో జరుగుతున్న విషప్రచారం దృష్ట్యా వాస్తవ పరిస్థితి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత రాష్ట్ర యువతకు ఏర్పడింది.

ఉద్యోగాలలో ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు ఉద్యోగాలు అని రెండు రకాలు. నిరుద్యోగ యువతలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాన్నే ఆశిస్తారు. దాన్ని ఎవరూ తప్పుబట్టాల్సిన అవసరం లేదు. అది వారి హక్కు కూడా. కానీ ఇరవై ఎనిమిది రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాలు, నూటా నలభై రెండు కోట్ల జనాభా ఉన్న సువిశాల భారతదేశంలో కేవలం పన్నెండు కోట్ల ఎనిమిది లక్షల ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాల సర్వీసుల్లో, నలభై ఏడు లక్షల ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్నట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అదేవిధంగా నాలుగు కోట్ల జనాభా ఉన్న తెలంగాణలో ఆరు లక్షల ఎనభై వేలమంది ఉద్యోగులు ఉన్నట్టు తెలుపుతున్నాయి. ఈ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 10శాతం కూడా మించటం లేదు. ప్రస్తుతం ఉన్న ఈ ఉద్యోగులకు సకాలంలో జీతాలిచ్చేందుకు సంబంధిత ప్రభుత్వాలు అష్టకష్టాలు అనుభవిస్తున్నాయి. ఇటీవల దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ గణనీయంగా పెరిగింది. అదే సమయంలో అభివృద్ధితో పాటు అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయవలసిన ఆవశ్యకత ప్రభుత్వాలకు ఏర్పడటంతో ఖర్చు కూడా అమాంతం పెరిగింది. పర్యవసానంగా ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్త ప్రభుత్వ ఉద్యోగాలను పరిమిత సంఖ్యలోనే సృష్టించుకోవలసిన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వాలకు ఏర్పడింది. దీని ప్రకారం చదువుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వాలకు సాధ్యం కాదని తెలుస్తున్నది. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగాలు రాని నిరుద్యోగి దానికోసం ఎదురుచూడకుండా ప్రైవేటు ఉద్యోగం లేదా ఉపాధి లాంటి ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలు చూసుకొని తమ భవిష్యత్తుకు పునాది వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రైవేటు సెక్టార్‌లో ఏటా లక్షలాది ఉద్యోగ అవకాశాలు ఏర్పడుతున్నాయి. తెలంగాణలో 2014 నుంచి నేటి వరకు ప్రైవేటు రంగంలో సుమారు 24 లక్షల ఉద్యోగ నియామకాలు జరిగినట్టు ఇటీవల సంబంధిత అధికారులు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఒక్క ఐటీ పరిశ్రమలోనే ఈ తొమ్మిదిన్నరేండ్లలో సుమారు ఏడు లక్షల ఉద్యోగ నియామకాలు జరిగినట్టు అదే నివేదికలో పొందుపరిచారు.

ఇటువంటి వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నిరుద్యోగులకు ఆ